# బలగం TV
BALAGAM
నిజమే మా బలం.. ప్రజలే మా బలగం
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ శనివారం 04 జనవరి 2025 | www.balagamtv.com | పేజీలు 4


## సావిత్రిబాయి పూలే సామాజిక సంస్కర్త


- సీఎం రేవంత్‌రెడ్డి



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

సామాజిక సంస్కర్త, ఆధునిక భారత తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకుని శుక్రవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆమె చిత్రపటానికి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో సీఎం సలహా దారులు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ సలహా దారు హర్కర వేణుగోపాల్, ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆర్ఆర్ఆర్ భూసేకరణ వేగవంతం చేయాలి



- నాగపూర్-విజయవాడ కారిడార్ కోసం భూసేకరణ ప్రక్రియ చేపట్టాలి
- అటవీ శాఖ పరిధిలోని సమస్యలను వెంటనే పరిష్కరించాలి
- అటవీ శాఖ, ఆర్ అండ్ బీ శాఖలు సమన్వయంతో ముందుకు వెళ్లాలి
- రైతులకు మెరుగైన పరిహారమందించాలి పంట పొలాలున్నచోట అండర్‌పాస్‌లు
- ఆర్‌అండ్‌బీ, అటవీ శాఖలు సమన్వయంతో ముందుకు సాగాలి
- మూడేండ్లలో రోడ్లు పూర్తి చేయాలి
- సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

రీజనల్ రింగ్ రోడ్డు, ఆర్ అండ్‌బీ, నేషనల్ హైవే ప్రాజెక్టులపై అధికారులతో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర సచివాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. రీజనల్‌రింగ్ రోడ్‌కు సంబంధించి భూసేకరణ ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. నాగ్ పూర్-విజయవాడ కారిడార్‌కు సంబంధించి తెలంగాణ జిల్లాల్లో అసంపూర్తిగా మిగిలిన భూసేకరణ ప్రక్రియను సంక్రాంతిలోగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అటవీశాఖ పరిధిలో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని అన్నారు. అటవీశాఖ, ఆర్ అండ్ బీ శాఖలు సమన్వయంతో ముందుకు వెళ్లాలని, రెండు శాఖల్లో ఒక్కో అధికారిని ఇందుకు ప్రత్యేకంగా నియమించాలని సూచించారు. రెండు శాఖలు సమావేశమై సంబంధిత శాఖల పరిధిలోని భూసేకరణ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో ప్రతీ గ్రామం నుంచి మండల కేంద్రానికి బీటీ రోడ్డు ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా రోడ్డు వెడల్పు ఉండే విధంగా డిజైన్ చేయాలని సూచించారు. కొత్త గ్రామపంచాయతీలతో సహా ప్రతీ గ్రామం నుంచి మండల కేంద్రానికి బీటీ రోడ్డు ఉండాల్సిందేనని ఆదేశించారు. ఇందుకు సంబంధించి విడతల వారీగా నిధులు విడుదల చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఇక ఏ గ్రామానికి రోడ్డు లేదనే మాట వినబడొద్దని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఈ సమావేశంలో మంత్రులు భట్టి విక్రమార్క, కోమటిరెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కొండా సురేఖ, సీతక్క పాల్గొన్నారు.

గత పదేళ్లలో కేసీఆర్ ప్రభుత్వం పరిపాలన వ్యవస్థను భ్రష్టు పట్టించిందని సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర విమర్శలు గుప్పించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పరిపాలన వ్యవస్థను పునరుద్ధరించే ప్రయత్నం చేశామని ఉద్ఘాటించారు.. సచివాలయంలో తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ 2025 డైరీ, క్యాలెండర్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం ఆవిష్కరించారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ తదితరులు హాజరయ్యారు. అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు సీఎం తెలిపారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం కష్టకాలంలో బాధ్యతలు చేపట్టిందని అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో కంటే ప్రత్యేక రాష్ట్రంలో మీరు ఎదుర్కొన్న ఇబ్బందులు అందరికీ తెలుసునని చెప్పారు. అలాంటి పరిస్థితుల్లో ఒక గొప్ప అవకాశం తమ ప్రభుత్వానికి ఇచ్చారని గుర్తుచేశారు. తాము అధికారంలోకి రాగానే తెలంగాణ ప్రజలకోసం పనిచేసే ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతీ నెల మొదటి తేదీన జీతాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు.

మిగితా 2వ పేజీలో

## 2050 నాటి హైదరాబాద్ అవసరాలకు తగినట్టు నీటి సరఫరాకు ప్రణాళిక తయారు చేయాలి

- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- ఐసీసీసీలో సెంటర్‌లో హైదరాబాద్ జల మండలి బోర్డుతో సీఎం సమావేశం

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

రాబోయే 25 ఏండ్ల భవిష్యత్తు అవసరాలను అంచనా వేసుకొని, గ్రేటర్ హైదరాబాద్ సిటీలో తాగునీటి సరఫరాకు సరిపడే మౌలిక సదుపాయాల ప్రణాళికను తయారు చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి జలమండలి అధికారులను ఆదేశించారు. గ్రేటర్ హైదరాబాద్ సిటీ విస్తరణను దష్టిలో పెట్టుకొని 2050 సంవత్సరం నాటికి పెరిగే జనాభా అవసరాలకు సరిపడేలా ఫ్యూచర్ ప్లాన్ ఉండాలని దిశానిర్దేశం చేశారు. ఇంటింటికీ తాగునీటితో పాటు సీవరేజీ ప్లాన్‌ను రూపొందించాలని, అవసరమైతే ఏజెన్సీలు, కన్సల్టెన్సీలతో అధ్యయనం చేయించాలని అన్నారు. ఇంటిగ్రేటేడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో శుక్రవారం హైదరాబాద్ జల మండలి బోర్డు సమావేశం జరిగింది. బోర్డు ఛైర్మన్ హెూదాలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఈ సమావేశానికి అధ్యక్షత వహించారు. ప్రస్తుతం హైదరాబాద్ సిటీలో ఉన్న జనాభాకు సరిపడే తాగునీటిని సరఫరా చేస్తున్నామని, మొత్తం 9800 కిలోమీటర్ల డ్రింకింగ్ వాటర్ డిస్ట్రిబ్యూషన్ నెట్వర్క్ ద్వారా 13.79 లక్షల కనెక్షన్లున్నాయని అధికారులు సీఎంకు నివేదించారు. మంజీరా, సింగూరు, గోదావరి, కష్ణా నుంచి సిటీకి ప్రస్తుతం నీటి సరఫరా జరుగుతోందని, గోదావరి ఫేజ్ 2 ద్వారా మరింత నీటిని తెచ్చుకొని ఉస్మాన్ సాగర్ , హిమాయత్ సాగర్ వరకు తాగునీటి సరఫరాకు డిజైన్ చేసిన ప్రాజెక్టుపై సమావేశంలో చర్చ జరిగింది. హైదరాబాద్ తాగునీటి అవసరాలకు గోదావరి ఫేజ్ 2 ప్రాజెక్టుకు, మల్లన్నసాగర్ నుంచి నీటిని తీసుకోవాలా, కొండపోచమ్మ సాగర్ ను నీటి వనరుగా ఎంచుకోవాలా

అనే అంశంపై సమావేశంలో చర్చించారు. కన్సల్టెన్సీ ఏజెన్సీలు ఇచ్చిన రిపోర్టుతో పాటు నీటి లభ్యత ఎక్కువగా ఉండటం, లిఫ్టింగ్ వ్యయాన్ని దష్టిలో పెట్టుకొని మల్లన్నసాగర్ నుంచే తాగునీటి సరఫరా ప్రాజెక్టును చేపట్టాలని నిర్ణయం తీసుకున్నారు. గతంలో ప్రతిపాదించిన 15 టీఎంసీలకు బదులు, సిటీ అవసరాల దష్ట్యా 20 టీఎంసీల నీటిని తెచ్చుకునేలా మార్పులకు ఆమోదం తెలిపారు.

ఈ సందర్భంగా హైదరాబాద్ జలమండలి ఆదాయ వ్యయాల నివేదికను ఎండీ అశోక్ రెడ్డి

మిగితా 2వ పేజీలో



### 2030 నాటికి 20 వేల మెగావాట్ల

# పునరుత్పాదక ఇంధనం


- డిప్యూటీ సీఎం, ఆర్థిక, విద్యుత్ శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్క

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్ దృష్ట్యా 2030 నాటికి 20వేల మెగావాట్ల పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులు ఏర్పాటు చేయాలని నిర్ణయించామని డిప్యూటీ సీఎం, ఆర్థిక, విద్యుత్ శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. శుక్రవారంనాడిక్కడి హెచ్ఐసీసీలో తెలంగాణ క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ-2024 పేరుతో వాటాదారుల సంప్రదింపుల సమావేశాన్ని నిర్వహించారు. దీనికి దేశవ్యాప్తంగా పునరుత్పాదక ఇంధన ఉత్పత్తిదారులు, పారిశ్రామిక సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు. ఇంధనశాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, సింగరేణి సీఎమ్‌డీ బలరాం నాయక్, ట్రాన్స్‌కో సీఎమ్‌డీ కృష్ణభాస్కర్, టీజీఎస్పీడీసీఎల్ సీఎమ్‌డీ ముషారఫ్ ఫారూఖీ, టీజీఎన్పీడీసీఎల్ సీఎమ్‌డీ వరుణ్‌రెడ్డి, టీజీరెడ్కో వైస్ చైర్మెన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ వావిళ్ల అనీల తదితరులు పాల్గొన్నారు. ఉదయం జరిగిన ఈ సమావేశంలో మంత్రి ప్రారంభోపన్యాసం చేశారు. అనంతరం సాయంత్రం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుతం రాష్ట్రంలో 15,623 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ ఉన్నదనీ, 2029-30 నాటికి ఇది 24,215 మెగావాట్లకు చేరుతుందనీ, 2035 నాటికి ఈ డిమాండ్ 31,809 మెగావాట్లకు చేరుతుందని అంచనా వేశామన్నారు. ప్రపంచవ్యాప్తంగా పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నివారణా చర్యల్లో భాగంగా పునరుత్పాదక ఇంధనంపై దృష్టి పెట్టాలని కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసిందని తెలిపారు. దానిలో భాగంగా రాష్ట్రంలో 2030 నాటికి 20వేల మెగావాట్ల పునరుత్పాదక, క్లీన్ అండ్ గ్రీన్ ఇంధనాన్ని తెచ్చేలా కొత్త విద్యుత్ పాలసీని రూపొందిస్తున్నామని వివరించారు. దానికోసం అన్ని వర్గాల ప్రజలు, పారిశ్రామికవేత్తల అభిప్రాయాలను సేకరిస్తున్నామని చెప్పారు. ఈ పాలసీని త్వరలోనే మంత్రివర్గ సమావేశంలో ఆమోదించి ఆ తర్వాత అమల్లోకి తెస్తామన్నారు. దీనికోసం ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా, దేశవ్యాప్తంగా ఆధునిక సాంకేతికతపై పూర్తిస్థాయి అధ్యయనం చేశామన్నారు. పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టుల నిర్మాణానికి ప్రోత్సాహకాలు ఇస్తామని చెప్పారు. రాజస్థాన్, హిమాచల్ ప్రదేశ్ వంటి ఇతర రాష్ట్రాల్లో కూడా జాయింట్ వెంచర్లుగా పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులను ఏర్పాటు చేసేలా విధివిధానాలు రూపొందిస్తున్నామని తెలిపారు. 20 వేల పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టుల్లో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పీఎమ్ కుసుమ్ పథకం ద్వారా 4వేల మెగావాట్ల వరకు మహిళా స్వయం సహాయక బృందాలకు కేటాయిస్తూ ఒప్పందం జరిగిందని చెప్పారు. అలాగే వ్యవసాయ భూముల్లోనూ రైతులకు అదనపు ఆదాయం వచ్చేలా ప్రాజెక్టుల ఏర్పాటుకు అవసరమైన విధివిధానాలపై కసరత్తు చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో మిగులు విద్యుత్ ఉండేలా, ఇతర రాష్ట్రాలకు సరఫరా చేసేలా ప్రాజెక్టుల నిర్మాణం చేపడతామని అన్నారు. పునరుత్పాదక ప్రాజెక్టుల్లో టీజీ జెన్‌కో భాగస్వామ్యంపై మంత్రి స్పష్టమైన సమాధానం చెప్పలేదు. పెరిగే డిమాండ్‌కు అనుగుణంగా ట్రాన్స్‌మిషన్ ఏర్పాట్లపైనా స్పష్టత ఇవ్వలేదు. ప్రస్తుతం ప్రయివేటు భాగస్వాములతోనే మాట్లాడుతున్నామని చెప్పారు. రాష్ట్రంలో కొత్తగా వస్తున్న ఫ్యూచర్ సిటీ, ఏఐ సిటీ, ఫార్మాసిటీ, మెట్రో రైల్ విస్తరణ, రీజినల్ రింగ్ రోడ్, ఇండస్ట్రియల్ క్లస్టర్స్ దృష్ట్యా విద్యుత్ డిమాండ్ పెరుగుతుందని విశ్లేషించారు. రాష్ట్రంలో ప్రస్తుతం పునరుత్పత్తి ఇంధన సామర్థ్యం 11,399 మెగావాట్లు ఉందనీ, దానిలో సోలార్ విద్యుత్ 7,889 మెగావాట్లు, జల విద్యుత్ 2,518 మెగావాట్లతో పాటు ఇతర మార్గాల ద్వారా మిగిలిన విద్యుదుత్పత్తి జరుగుతున్నదని వివరించారు. ఇప్పటికే శ్రీశైలం, నాగార్జునసాగర్ వంటి ప్రాజెక్టుల్లో పంప్డ్ స్టోరేజ్ ఉన్నాయనీ, ఫ్లోటింగ్ సోలార్, గ్రీన్ హైడ్రోజన్ టెక్నాలజీ వంటి ఇంధన ఉత్పత్తి మార్గాలు కూడా పరిశీలనలో ఉన్నాయన్నారు.

# చైనాలో కొత్త వైరస్..





బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

చైనాలో వెలుగుచూసిన హ్యూమన్ మెటానిమోవైరస్.. ఇప్పుడు ప్రపంచం మొత్తాన్ని తీవ్రంగా భయపెడుతోంది. చైనా నుంచి ఇప్పటికే జపాన్, హాంకాంగ్ దేశాలకు వ్యాప్తి చెందిన ఈ హెచ్ఎంపీవీ వైరస్.. ఆసియా దేశాలకు విస్తరించనుంది అనే భయాలు నెలకొన్నాయి. ఇక చైనాలో ఈ హెచ్ఎంపీవీ వైరస్ బారిన పడి ఆస్పత్రుల ముందు క్యూ కడుతున్నారన్న వార్తలు వెల్లువెత్తుతున్న వేళ.. ఈ వ్యవహారంపై భారత్ స్పందించింది. చైనాలో వెలుగుచూసిన కొత్త వైరస్ కారణంగా భారత్‌లో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తేల్చి చెప్పింది. హ్యూమన్ మెటానిమోవైరస్ వ్యాప్తి పట్ల ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని డీజీహెచ్ఎస్ ఉన్నతాధికారి డాక్టర్ అతుల్ గోయల్ విజ్ఞప్తి చేశారు.

చైనాలో మరో కొత్త వైరస్ వ్యాప్తి చెందుతున్న వార్తల నేపథ్యంలో భారత హెల్త్ ఏజెన్సీ.. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్-డీజీహెచ్ఎస్ స్పందించింది. ఈ హ్యూమన్ మెటానిమోవైరస్ వ్యాప్తి పట్ల ఎవరూ భయం గానీ, ఆందోళన గానీ పడాల్సిన అవసరం లేదని డీజీహెచ్ఎస్ ఉన్నతాధికారి డాక్టర్ అతుల్ గోయల్ సూచించారు. శ్వాసకోశ సంబంధిత ఇన్ఫెక్షన్ల నుంచి కాపాడుకునేందుకు ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని హితవు పలికారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల గురించి ఏ మాత్రం భయపడాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. చైనాలో హెచ్ఎంపీవీ వైరస్ విజృంభిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయని.. అతుల్ గోయల్ తెలిపారు. ఈ వైరస్ సాధారణ జలుబుకు కారణమయ్యే ఇతర శ్వాసకోశ వైరస్‌ల లాగే ఉంటుందని.. అయితే పిల్లలు, వృద్ధుల్లో ఫ్లూ వంటి లక్షణాలను చూపిస్తుందని పేర్కొన్నారు. భారత్‌లో శ్వాసకోశ సంబంధిత వైరస్‌ల వ్యాప్తికి సంబంధించిన సమాచారాన్ని ఇప్పటికే విశ్లేషించామని.. డిసెంబర్ వరకు ఉన్న డేటాలో ఎలాంటి భారీ మార్పులు కనిపించలేదని తెలిపారు. ఆరోగ్య సంస్థల నుంచి కూడా పెద్ద సంఖ్యలో నమోదైన కేసులేవీ రాలేదని అతుల్ గోయల్ స్పష్టం చేశారు.

ప్రస్తుతం నడుస్తున్న శీతాకాలంలో శ్వాసకోశ వైరస్ ఇన్‌ఫెక్షన్లు ఎక్కువగా వ్యాప్తి చెందుతాయని.. ఇందుకోసం ఆస్పత్రుల్లో వసతులు సమకూర్చుకోవాలని డీజీహెచ్ఎస్ అధికారి అతుల్ గోయల్ తెలిపారు. ఆస్పత్రుల్లో ఇతర సామగ్రి, పడకలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. ముఖ్యంగా అన్ని శ్వాసకోశ ఇన్ఫెక్షన్ల నియంత్రణకు సాధారణ జాగ్రత్తలు తీసుకోవడం చాలా అవసరమని పేర్కొన్నారు. దగ్గు, జలుబు ఉన్నవారు ఎక్కువ మందితో కలవడం మంచిది కాదని తెలిపారు. మామూలుగా దగ్గు, తుమ్ములు వచ్చినప్పుడు టవల్‌ను అడ్డుగా పెట్టుకోవాలని సూచించారు. జలుబు, జ్వరం ఉంటే అవసరమైన మందులు తీసుకోవాలని తెలిపారు. ఇప్పుడు ఉన్న పరిస్థితి గురించి మాత్రం ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అతుల్ గోయల్ పేర్కొన్నారు.

# కేటీఆర్‌కు ఏసీబీ నోటీసులు

- 6న విచారణకు రావాలని ఆదేశం

వివరాలు 2వ పేజీలో

## 28న నాగోబా జాతర



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

ప్రకృతి ఆరాధకులైన ఆదివాసులు పుష్యమాసాన్ని ఎంతో పవిత్రంగా భావిస్తారు. ఏటా ఈ మాసంలో ఆరాధ్య దైవం వర ప్రదాయినిగా నాగోబా ఉత్సవాలు జరపడం ఆనవాయితీ. ఆదివాసి సంప్రదాయం ప్రకారం అత్యంత కఠిన నియమనిష్ఠలతో ఏటా పుష్య మాసంలో ఈ పూజలు జరపడం జరుగుతుంది. శుక్రవారం ప్రఖ్యాతిగాంచిన కేస్లాపూర్ గ్రామం నుండి రథయాత్రను ప్రారంభించారు. ఈనెల 28న జరిగే కేస్లాపూర్ నాగోబా జాతరకు తమ కులస్తులను ఆహ్వానంగా మర్యాదపూర్వకంగా ఏడు గ్రామాల్లో మకాం వేస్తూ వారిని పిలుస్తారు. ఈ సందర్భంగా కటోడ ప్రధాన్ లు ఈ రథంపై వెళ్లడం ఆనవాయితీ. నేడు కేస్లాపూర్ కుండా సిరికొండ మండలం రాజంపేట వద్ద బసచేస్తూ ఆనవాయితీగా జాతరకు కుండలు చేసే కుమ్మరికి నూతన కుండలను నిర్మించడానికి ఆదేశిస్తారు. అలాగే 4వ తేదీ, రాజంపేట నుండి కువాడికి వెళ్తారు.

5వతేదీ నా సోయంగూడకు వెళ్తారు. 6వ తేదీ సోయంగూడ నుండి గిన్నెరకు వచ్చి బస చేస్తారు. 7వతేదీన గిన్నె రా నుండి సాలివాడకు వెళ్తారు. అలాగే 8వ తేదీన సాలివాడ నుండి బయలుదేరి వడగంలో బస చేస్తారు. 9వతేదీన పొడగమ నుండి బయలుదేరి కేస్లాపూర్ నుండి ఇంటి వద్దకు వస్తారు. ఇలా ఏడు రోజులపాటు వీరి సంస్కృతిలో భాగంగా జాతరకు ఆహ్వానంగా బంధు మిత్రులను పిలవడం అనవాయితీ.

### స్థానిక సంస్థల ఎన్నికల్లో
## బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాల్సిందే



- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాల్సిందే అని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని కవిత గుర్తు చేశారు. ఇందిరా పార్క్ వద్ద తలపెట్టిన బీసీ మహాసభలో కవిత పాల్గొని ప్రసంగించారు. జనగణనలో భాగంగా కులగణన చేయాలని బీజేపీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. తెలంగాణ జాగృతి ఉద్యమం

మిగితా 2వ పేజీలో

## జరీన్, సిరాజ్‌ల సహకారంతో అంతర్జాతీయ క్రీడాకారులకు తయారు చేస్తాం

- డీజీపీ జితేందర్

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

అంతర్జాతీయ క్రీడాకారుల్ని తయారు చేసేలా టీజీఎస్పీ ని తీర్చిదిద్దుతామని డీజీపీ జితేందర్ అన్నారు. యూసఫ్ గూడలోని బెటాలియన్ కానిస్టేబుళ్ల పాసింగ్ అవుట్ పరేడ్ నేడు నిర్వహించారు. ఇందులో 549 మంది కానిస్టేబుళ్లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీజీపి మాట్లాడుతూ, ఇద్దరు ఇంటర్నేషనల్ ఆటగాళ్ళు మన టీజీఎస్పీ లో చేరారని అన్నారు. ఒకరు నిఖత్ జరీన్, మరొకరు మహమ్మద్ సిరాజ్ అని తెలిపారు. వాళ్ళను సద్వినియోగం చేసుకునేందుకు ప్రత్యేక ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదిస్తున్నానని పేర్కొన్నారు. పోలీస్ ట్రైనింగ్‌లో భాగంగా బాక్సింగ్, క్రికెట్ పై కూడా శిక్షణ ఇచ్చి ఇంటర్నేషనల్ స్టాండర్డ్ ఆటగాళ్లను కూడా తయారు చేయాలన్నది తమ ఆశయం అని చెప్పారు.

యూసుఫ్‌గూడ ఫస్ట్ బెటాలియన్‌లో పాసింగ్ ఔట్ పరేడ్ లో పాల్గొన్న డీఎస్పీ, ఇంటర్నేషనల్ బాక్సర్ నిఖత్ జరీన్ లో మాట్లాడుతూ, తెలంగాణ పోలీస్ యూనిఫాం ధరించడం గౌరవంగా ఉందన్నారు. ఖాకీ యూనిఫామ్ ధరించడంతో తన కల నెరవేరింది పేర్కొన్నారు. ఇప్పటి వరకు బాక్సర్ నిఖత్ అని పిలిచే వారు.. ఇప్పుడు డీఎస్పీ నిఖత్ అని పిలుస్తున్నారని చెప్పారు. ట్రైనింగ్ పొందుతున్న కానిస్టేబుల్స్‌కి బాక్సింగ్‌లో కూడా శిక్షణ ఇవ్వాలని డీజీపీ కోరారని చెప్పారు. తనకు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటానన్నారు. పోలీస్ కానిస్టేబుల్స్ నుంచి కూడా ఒలింపియన్స్, ఇంటర్నేషనల్ ప్లేయర్స్‌ను తయారు చేయొచ్చని నిఖత్ జరీన్ తెలిపారు.

## రైతులకు కాంగ్రెస్ వెన్నుపోటు

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో



ఎన్నికలకు ముందు ఎన్నో ఆశలు కల్పించి అధికారంలోకి వచ్చిన పార్టీ.. ఆ హామీలను అమలు చేయకుండా రైతులకు వెన్నుపోటు పొడుస్తున్నదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. రుణమాఫీ అరకొరగా చేశారని, ఇప్పుడు రైతు భరోసాకు కొర్రీలు పెట్టే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం వద్ద రైతుల వివరాలన్నీ ఉన్నా దరఖాస్తుల పేరుతో మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నదని విమర్శించారు. వరంగల్ రైతు డిక్లరేషన్ పేరుతో రైతులకు అనేక హామీలిచ్చి, ఇప్పుడు అమలు చేయడం లేదని ఆరోపించారు. రైతు భరోసా కింద రూ.15 వేల చొప్పున ఆర్థికసాయం, రైతు కూలీలకు రూ.12 వేల సాయం, వరితోపాటు సుమారు 10 రకాల పంటలపై రూ.500 బోనస్, పత్తి, మొకజొన్న, కందులు, సోయాబీన్, పత్తి, మిర్చి, పసుపు, ఎర్రజొన్న, చెరుకు, జొన్నలకూ ఇస్తామన్న బోనస్ హామీలు ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. 'మార్పు' పేరుతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, ఏడాదిగా ప్రజల జీవితాల్లో మార్పు రాలేదని, కాంగ్రెస్ నేతల్లో మాత్రం వచ్చిందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్‌ది ప్రజలను మోసం చేసే ప్రభుత్వమని మండిపడ్డారు. నిరుడు నవంబరు 30న పాలమూరులో సీఎం రేవంత్ ఇచ్చిన చెక్కులకు ఇప్పటివరకూ డబ్బులు పడలేదని ధ్వజమెత్తారు.

# కేటీఆర్‌కు ఏసీబీ నోటీసులు

**బలగం టీవీ, హైదరాబాద్**

ఫార్ములా ఈ రేస్ కారు రేసింగ్ కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌కు అవినీతి నిరోధక శాఖ (ఎసిబి) అధికారులు నోటీసులు జారీ చేశారు. ఈ నెల 6వ తేదీ ఉదయం పది గంటలకు విచారణకు హాజరు కావాలని నోటీసుల్లో ఎసిబి అధికారులు పేర్కొన్నారు. ఫార్ములా ఈ రేస్ కారు రేసింగ్ కేసులో ఎసిబి ఇప్పటికే కెటిఆర్‌ను ఎ1 నిందితుడిగా చేరుస్తూ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. అయితే ఇదే కేసులో మాజీ మంత్రి కెటిఆర్‌కు ఇడి అధికారులు కూడా నోటీసులు జారీ చేశారు. ఈ నెల 7వ తేదీన విచారణకు హాజరు కావాలని నోటీసుల్లో పేర్కొన్నారు. అయితే 7వ తేదీన ఇడి అధికారుల ఎదుట హాజరు కావాల్సి ఉన్న సమయంలో ఎసిబి అధికారులు ఒకరోజు ముందు నోటీసులు జారీ చేసి విచారణకు పిలవడం చర్చనీయాంశమైంది.

ఇటీవల దానకిశోర్ నుంచి సుమారు ఏడు గంటల పాటు విచారించిన ఎసిబి పలు వివరాలను తీసుకుంది. వాటి ఆధారంగా దర్యాప్తును ముందుకు తీసుకెళ్లే పనిలో ఉంది. ఈ క్రమంలో కెటిఆర్‌కు నోటీసులు జారీ చేసింది.ప్రాథమిక దర్యాప్తు క్రమంలో ఎంఏయూడీ నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా ఒప్పందంలో చోటు చేసుకున్న పలు కీలక ఉల్లంఘనలను ఎసిబి ఇప్పటికే గుర్తించినట్లు తెలుస్తోంది. వీటి కేంద్రంగా నిందితులను విచారించే అవకాశం కనిపిస్తోంది.

## రేవంత్ రెడ్డి ప్రజాదర్బార్‌కు ఒకేరోజు హాజరయ్యారు

**హరీశ్ రావు**

**బలగం టీవీ, హైదరాబాద్**



కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన కొత్తలో సీఎం రేవంత్ రెడ్డి ప్రజాదర్బార్‌కు ఒకే ఒకరోజు హాజరై... 10 నిమిషాలు మాత్రమే ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరించారని... దీనిని బట్టే ప్రజాదర్బార్ పట్ల సీఎంకు ఉన్న చిత్తశుద్ధి ఏమిటో వెల్లడైందని బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. సీఎం కార్యాలయంలో ప్రతిరోజూ ప్రజాదర్బార్ నిర్వహిస్తామని కాంగ్రెస్ అభయహస్తం మేనిఫెస్టోలో డబ్బా కొట్టిందన్నారు. ప్రజాదర్బార్‌ను నిర్వహించకపోగా పేరు మార్చి ప్రజావాణిగా చేశారన్నారు. ప్రజాదర్బార్‌లో మంత్రులు అందుబాటులో ఉంటారని సీఎం చెప్పారని, కానీ ఆ మాటను కూడా నిలబెట్టుకోలేదన్నారు. మంత్రులకు గాంధీభవన్‌కు వెళ్లేందుకు ఉన్న తీరిక, ప్రజావాణికి రావడానికి మాత్రం ఉండటం లేదన్నారు. దీంతో ప్రజావాణి పట్ల మంత్రుల చిత్తశుద్ధి ఏపాటిదో కూడా తేలిపోయిందన్నారు. సీఎం రాకుండా... మంత్రులూ రాకుండా... చివరకు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులతో తూతూ మంత్రంగా ప్రజావాణి నిర్వహిస్తున్నారని ఆరోపించారు.

ప్రజాదర్బార్‌ను ప్రతిరోజు నిర్వహిస్తామని మేనిఫెస్టోలో పేర్కొని, ఇప్పుడు వారానికి 2 రోజులు మాత్రమే నిర్వహిస్తున్నారని మండిపడ్డారు. ఆ రెండు రోజులు కూడా ప్రజావాణికి రావడం, దరఖాస్తులు సమర్పించడం ఉత్త వృథా ప్రయాసే అవుతోందని జనం వాపోతున్నారన్నారు.

2024 డిసెంబర్ 9 నాటికి ప్రజావాణికి 82,955 పిటిషన్లు వచ్చినట్లు అధికారులు చెబుతున్నారని, అయితే, అందులో కేవలం 43,272 పిటిషన్లు మాత్రమే గ్రీవెన్స్ కిందకు వస్తాయని, మిగతావి గ్రీవెన్స్ పరిధిలోకి రావని చెబుతున్నారన్నారు. గ్రీవెన్స్‌కు సదరు అధికారులు ఇస్తోన్న నిర్వచనం ఏమిటంటే... ఫిర్యాదు, అన్యాయం, హక్కులకు భంగం, ప్రభుత్వ పథకాలు అందకపోవడం, అధికారులు వారి విధులు నిర్వహించకపోవడం, ప్రజలకు సిటిజన్ చార్టర్ ప్రకారం అందాల్సిన సదుపాయాలు అందకపోవడం... వీటినే గ్రీవెన్స్ కింద పరిగణిస్తామని చెబుతున్నారని తెలిపారు.

## గర్భంలోనే శిశువు గుండెకు శస్త్రచికిత్స

**హైదరాబాద్ రెయిన్ బో వైద్యుల అరుదైన ఘనత -**

**బలగం టీవీ, హైదరాబాద్**

హైదరాబాద్ రెయిన్‌బో ఆస్పత్రి వైద్యులు అరుదైన ఘనత సాధించారు. రెయిన్‌బో చిల్డ్రన్స్ హార్ట్ ఇనిస్టిట్యూట్‌లోని మల్టీ డిసిప్లినరీ వైద్యుల బృందం.. ప్రత్యేకమైన పీడియాట్రిక్ హార్ట్ సెంటర్.. గర్భంలో 27 వారాల పిండంపై క్లిష్టమైన వాల్వులోప్లాస్టీ శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించింది. అధునాతన టెక్నాలజీ, పరికరాల సాయంతో గర్భంలో ఉండగానే శిశువుకు హృదయ సంబంధిత సమస్యలకు సంబంధించి సర్జరీని వైద్యుల బృందం నిర్వహించింది. ఈ ప్రక్రియ ప్రపంచంలోనే తొలిసారని.. వైద్యులు తెలిపారు. ఈ సర్జరీని చీఫ్ పీడియాట్రిక్ కార్డియాలజిస్ట్ డాక్టర్ కోనేటి నాగేశ్వరరావు, పీడియాట్రిక్ కార్డియాలజిస్ట్ డాక్టర్ శ్వేతా బఖ్రు, పీడియాట్రిక్ కార్డియాలజిస్ట్ డాక్టర్ శ్రీ ఫణిభార్గవి ధూళిపూడి నేతృత్వంలో ఫీటల్ మెడిసిన్ స్పెషలిస్టులు, పీడియాట్రిక్ కార్డియాలజిస్టులు, ఇంటర్వెన్షనల్ ఆబ్జెక్టివ్‌లు, ఇంటర్వెన్షనల్ ఆబ్జెక్టివ్ బృందంతో కూడిన మల్టీడిసిప్లినరీ బృందం విజయవంతంగా నిర్వహించినట్లు చెప్పారు. రెయిన్‌బో చిల్డ్రన్స్ హార్ట్ ఇన్‌స్టిట్యూట్‌లో అత్యాధునిక సాంకేతికత, మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నట్లు వివరించారు.




గర్భస్థ శిశువులోని బృహద్ధమని కవాటం స్టెనోసిస్ వల్ల కడుపులోనే బిడ్డ మరణానికి లేదా హైపోప్లాస్టిక్ లెఫ్ట్ హార్ట్ సిండ్రోమ్‌కు దారి తీయవచ్చని వైద్యులు తెలిపారు. దీన్ని నివారించేందుకు ఫీటల్ బెలూన్ బృహద్ధమని వాల్వులోప్లాస్టీ సాధారణంగా 70 శాతం విజయవంతమైన రేటుతో నిర్వహిస్తారు. సాధారణంగా ఈ ప్రక్రియ సమయంలో ఒక చిన్న సూది, మధ్యస్థ పరిమాణ బెలూన్ ఉపయోగిస్తారు. కానీ శిశువు గుండె నుంచి రక్తం లీక్ అయ్యే సమస్యలను ఇది పెంచే అవకాశం ఉండడంతో తాము పెద్ద సూది, పెద్ద బెలూన్‌ని ఎంచుకున్నట్లు వైద్యుల బృందం తెలిపింది.

## బీఆర్ఎస్ నేత క్రిశాంక్‌కు డాక్టరేట్

**బలగం టీవీ, హైదరాబాద్**

బీఆర్ఎస్ అధికార ప్రతినిధి మన్నె క్రిశాంక్‌కు ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రకటించింది. యూనివర్సిటీ జర్నలిజం విభాగం 'రిప్రజెంటేషన్ అండ్ ప్రజెంటేషన్ ఆఫ్ దళిత్స్ ఇన్ మీడియా' అనే అంశంపై క్రిశాంక్ సిద్ధాంత గ్రంథం సమర్పించారు. ప్రొఫెసర్ కరణం నరేందర్ పర్యవేక్షణలో ఆయన పీహెచ్‌డీ చేశారు. మాస్ కమ్యూనికేషన్‌లో పీజీ చేసి న క్రిశాంక్ ఇప్పటికే యూజీసీ నెట్ అర్హతసాధించి, కీలకమైన ప్రాజెక్టులో రీసెర్చ్ ఫెలోగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు.

# ఆర్ఆర్ఆర్ భూసేకరణ వేగవంతం చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

తమ ప్రభుత్వంపై ఆధారపడి ప్రజల కోసం పనిచేసే వారికి ప్రతీ నెలా మొదటి తేదీనే జీతాలు ఇస్తున్నామన్నారు. అక్కడక్కడా కొన్ని సమస్యలు ఉన్నాయని అన్నారు. ఆర్థిక పరిస్థితుల వల్ల ప్రభుత్వానికి ఆదాయం లేకపోవడంతో కొన్ని సమస్యలను పరిష్కరించలేకపోతున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడించారు.

"ప్రతీ నెల ప్రభుత్వానికి వచ్చే ఆదాయం రూ.18500 కోట్లు. ఇది ప్రభుత్వ అవసరాలకు సరిపోవడం లేదు. అన్నీ సక్రమంగా నిర్వహించాలంటే రూ.30వేల కోట్లు కావాలి. వచ్చే ఆదాయంలో రూ.6500కోట్లు ప్రభుత్వ ఉద్యోగుల జీతభత్యాలు, ఇతర అవసరాలకు చెల్లిస్తున్నాం. మరో రూ. 6500 కోట్లు ప్రతీ నెల అప్పులు చెల్లించాల్సిన పరిస్థితి. మిగిలిన రూ. 5500 కోట్లలో సంక్షేమ పథకాలు అమలు చేయాల్సిన పరిస్థితి. కనీస అవసరాలకు ప్రతీ నెల రూ. 22500 కోట్లు కావాలి. వచ్చిన ఆదాయంతో పోలిస్తే రూ.4000 కోట్లు తక్కువ పడుతోంది. సంక్షేమాన్ని, అభివృద్ధిని ప్రజలకు చేర్చేది ఉద్యోగులే. మేము అధికారంలోకి వచ్చిన ఏడాదిలో రాష్ట్రంలో సామాజిక మార్పును తీసుకొచ్చాం. ఆర్థికపరమైన మార్పులు తీసుకురావాలంటే ఇంకా కొంత సమయం పడుతుంది. రాష్ట్ర ఆదాయాన్ని పారదర్శకంగా ఖర్చు చేసేందుకు మీరు ఎలాంటి సలహాలు ఇచ్చినా తీసుకుంటాం" అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

"ప్రభుత్వ ఆదాయం ప్రతీ నెలా మరో రూ.4000 కోట్లు పెంచుకోవాలి. సంక్షేమ పథకాలు నిజమైన లబ్ధిదారుడికి చేరేలా చర్యలు తీసుకోవాలి. ఈ ప్రభుత్వం మనది%ొ%ఆదాయాన్ని పెంచాలన్నా, పెంచిన ఆదాయం పంచాలన్నా మీ చేతుల్లోనే ఉంది. మీ సమస్యలు చెప్పండి%ొ% పరిష్కారానికి కార్యాచరణ చేపడతాం. ఈ ప్రభుత్వం మీ సమస్యలను అర్థం చేసుకుని పరిష్కరిస్తుంది. సమస్యల పరిష్కారానికి మీరు ధర్నాలే చేయాల్సిన అవసరం లేదు. చర్చల ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయి. రాజకీయాల కోసం కొందరు నిరసనలు, ధర్నాలకు ప్రేరేపిస్తున్నారు. వారి ఉచ్చులో పడితే చివరకు నష్టపోయేది మీరే. అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని మాకు ఉన్నా చేయలేని పరిస్థితి. సర్వశిక్షా అభియాన్ కేంద్ర ప్రభుత్వ స్కీమ్. ఆ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసే అవకాశం లేదు. నిబంధనలకు విరుద్ధంగా రెగ్యులరైజ్ చేస్తే న్యాయస్థానాల్లో సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. అవకాశం లేకపోయినా రెగ్యులరైజ్ చేయాలని పట్టుబడితే సమస్య పెరుగుతుంది తప్ప పరిష్కారం కాదు. ప్రభుత్వ ఆదాయం పెంచుకునేందుకు మీ సహకారం కావాలి. మీ సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరిస్తాం. మిమ్మల్ని కష్టపెట్టి మీకు నష్టం కలిగే పనులు మా ప్రభుత్వం చేయదు" అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

## 2050 నాటి హైదరాబాద్ అవసరాలకు తగినట్టు నీటి సరఫరాకు ప్రణాళిక తయారు చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా సీఎంకు వివరించారు. జలమండలికి వచ్చే ఆదాయం ఉద్యోగుల జీతభత్యాలకు, తాగునీటి సరఫరా నిర్వహణ ఖర్చులకు సరిపోతుందని వివరించారు. వివిధ ప్రభుత్వ విభాగాలు, కార్యాలయాల నుంచి దాదాపు రూ. 4,300 కోట్ల బకాయిలు రావాల్సి ఉన్నాయని, కరెంటు బిల్లులకు జలమండలి దాదాపు రూ.5,500 కోట్లు బాకీ పడిందని, రూ.1,847 కోట్లు గతంలో తీసుకున్న అప్పులున్నాయని, దాదాపు రూ. 8,800 కోట్ల రెవిన్యూ లోటు ఉందని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఆదాయ వ్యయాలు ఆశాజనకంగా లేవని, వీటిని అధిగమించేందుకు ఆర్థిక శాఖ సమన్వయంతో తక్షణ కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. జలమండలి తమ సొంత ఆదాయాన్ని పెంచుకునే మార్గాలను అన్వేషించాలని, అందుకు అనుసరించాల్సిన విధానాలను అధ్యయనం చేయాలని సూచించారు. ఇప్పటికే 20 వేల లీటర్ల నీటిని సిటీలో ఉచితంగా సరఫరా చేస్తున్నందున, ఇతర కనెక్షన్ల నుంచి రావాల్సిన నల్లా బిల్లు బకాయిలు క్రమం తప్పకుండా వసూలయ్యేలా చూడాలని అన్నారు. జలమండలి కొత్తగా చేపట్టే ప్రాజెక్టులకు అవసరమయ్యే నిధులను సమకూర్చుకోవాలని, తక్కువ వడ్డీతో రుణాలు తెచ్చుకునే ప్రత్యామ్నాయాలను ఎంచుకోవాలని సూచించారు. అందుకు వీలుగా ప్రాజెక్టు డీపీఆర్లు తయారు చేయించాలన్నారు. మంజీరా నుంచి 1965 నుంచి సిటీలో పలు ప్రాంతాలకు నీటిని సరఫరా చేస్తున్న పైపు లైన్లకు కాలం చెల్లిందని, దీంతో రిపేర్లు వస్తే దాదాపు పది నుంచి 15 రోజులు నీటి సరఫరా నిలిచిపోతోందని అధికారులు సీఎంకు వివరించారు. పాత లైను వెంబడి ప్రత్యామ్నాయంగా మరో అధునాతన లైన్ నిర్మించేలా కొత్త ప్రాజెక్టు చేపట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. అవసరమైతే జల జీవన్ మిషన్ ద్వారా నిధులు తెచ్చుకునేందుకు వీలుగా ప్రాజెక్టు రిపోర్టు తయారే చేయాలన్నారు.

### స్థానిక సంస్థల ఎన్నికల్లో

## బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

యలేదు. బీసీల లెక్కలు ఒక కమిషన్ తీస్తుంటే మరో కమిషన్ నివేదిక ఇస్తుంది. ఇలా చేస్తే కోర్టుల్లో నిలబడుతుందా..? బీసీల గురించి ఎందుకు మాట్లాడుతున్నావంటూ కాంగ్రెస్ నాయకులు నన్ను ప్రశ్నిస్తున్నారు. సందర్భం వచ్చింది కాబట్టి మాట్లాడుతున్నా%ొ% ఎన్నికలు పూర్తయ్యాక ఎందుకు మాట్లాడలేదని మళ్లీ కాంగ్రెస్ నాయకులే అంటారు. ఎటువంటి లోటుపాట్లు లేకుండా స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాల్సిందే. 42 శాతం రిజర్వేషన్ల హామీ ఇచ్చారు కాబట్టి కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాల్సిందే. లేదంటే బీసీల జనాభా ఎంత ఉంటే అంత వాటా ఇచ్చి ఎన్నికల్లోకి వెళ్లాలి. దొంగ లెక్కలు, కాకిలెక్కలు కాకుండా వాస్తవ లెక్కలు తీయాలి అని ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు. మన ఉద్యమాల వల్లే సావిత్రీబాయి పూలే జయంతిని అధికారికంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మన ఉద్యమాలతో జంగుపట్టిన ప్రభుత్వ రథచక్రాలు కదులుతున్నాయి. బీసీలకు మంచి రోజులు వస్తాయి. కులం ఆధారంగా రాజ్యంగ నిర్మాతలు కొన్ని రక్షణలు కల్పించారు. అంబేద్కర్ కృషి చేయకుంటే ఎస్సీ, ఎస్టీలకు ఎటువంటి ఫలాలు దక్కకపోతుండేది. అదే సమయంలో బీసీ కులాలను రాజ్యాంగంలో రక్షణ కల్పించాల్సింది. ఆనాడే బీసీలకు రాజ్యంగపరమైన రక్షణ కల్పించి ఉంటే అభివృద్ధిలో భారతదేశం అమెరికాను దాటేసేది అని కవిత పేర్కొన్నారు.

## నుమాయిష్ ప్రారంభం

**బలగం టీవీ, హైదరాబాద్**

నుమాయిష్ సందడి మొదలైంది. నాంపల్లిలో ప్రతి సంవత్సరం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే 84వ అఖిల భారత వస్తు పారిశ్రామిక ప్రదర్శనశాల (నుమాయిష్)ను రాష్ట్ర మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ తదితరులు శుక్రవారం ప్రారంభించారు. నుమాయిష్ ద్వారా వచ్చే ఆదాయంతో ఎగ్జిబిషన్ సొసైటీ నిర్వహిస్తున్న విద్యాసంస్థలను పెంచాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. జమ్మూ, ఇతర రాష్ట్రాలు ఎక్కడికి వెళ్లి కొనుక్కోవాలనుకున్నా ఇక్కడే ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో లభిస్తాయని మంత్రి పొన్నం తెలిపారు. గతంలో ఎనిమల్ కాంపిటీషన్ జరుగుతుండేదని దానిని మళ్ళీ ప్రారంభించాలని కోరారు. మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ఎగ్జిబిషన్ సొసైటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న కమలా నెహ్రూ పాలిటెక్నిక్ కళాశాలను వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఇంజినీరింగ్ కళాశాలగా మారుస్తామన్నారు. గత ఏడాది నుమాయిష్‌ను సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారని తెలిపారు. ఎగ్జిబిషన్ ద్వారా సొసైటీ చాలా కళాశాలలు సక్సెస్‌ఫుల్‌గా నడుపుతున్నారన్నారు. ఒక ఎన్‌జీవోగా సొసైటీ నడుపుతున్నారని చెప్పారు. సావిత్రి బాయి పూలే జయంతి సందర్భంగా మహిళ ఉపాధ్యాయుల దినోత్సవంగా ప్రకటించుకున్నామని, కమలా నెహ్రూపాలిటెక్నిక్ కాలేజీతోపాటు ఇంజినీరింగ్ కాలేజ్‌ను వచ్చే ఏడాది ప్రారంభించుకోబోతున్నామన్నారు. ప్రతి రోజూ సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 10.30 గంటల వరకు, వారాంతాలు, సెలవు రోజుల్లో రాత్రి 11 గంటల వరకు నుమాయిష్ ప్రదర్శన కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.

# విద్యార్థులు ప్రతి సబ్జెక్టుపై పట్టు సాధించాలి



- మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా..
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**బలగం టీవీ , వేములవాడ**

రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా అని విద్యార్థులను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆరా తీశారు. శుక్రవారం వేములవాడ పట్టణంలోని బీసీ సంక్షేమ హాస్టల్ ను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా హాస్టల్ లోని విద్యార్థుల వసతి గదులు, ఆవరణ, పరిసరాలు, స్టోర్ రూం, కిచెన్ గదిని పరిశీలించారు. డిప్లొమా పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ రోజూ మెనూ ప్రకారం భోజనాలు అందిస్తున్నారా, రానున్న పరీక్షలకు ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లాలని,ప్రతి సబ్జెక్టుపై పట్టు సాధించాలని అన్నారు . హాస్టల్ లో ఎందరు విద్యార్థులు ఉంటున్నారో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ లక్ష్మీనారాయణను అడగగా, 97 మంది విద్యార్థులు ఉంటున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. నిత్యం విద్యార్థులతో ఆయా పాఠ్యాంశాలు చదివించాలని, రాయించాలని పేర్కొన్నారు.

## సావిత్రి బాయి పూలే ఆశయ సాధనకు కృషి



**-ఘనంగా సావిత్రి బాయి పూలే జయంతి**

**-కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల :**

సావిత్రి బాయి పూలే ఆశయ సాధనకు ప్రభుత్వం కృషి చేస్తున్నదని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు . సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా శుక్రవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సావిత్రి బాయి పూలే చిత్రపటానికి కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ జిల్లా అధికారులతో కలిసి శుక్రవారం పూల మాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ మహిళల విద్యకు ఆద్యురాలిగా నిలిచి, సమానత్వానికి పోరాడారని అన్నారు . పూలె దంపతుల సేవలను త్యాగాలను గుర్తు చేసుకున్నారు. భారత సమాజంలో చారిత్రాత్మకమైన మార్పుకు సావిత్రిబాయి పూలే గారు పునాది వేశారన్నారని అన్నారు.ఈ కార్యక్రమం లో జిల్లా విద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి, ఆయా శాఖల ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సావిత్రిబాయి పూలేకు భారతరత్న ఇచ్చి గౌరవించాలి



- సావిత్రిబాయి సేవలు అజరామారం
- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు

**బలగం టీవీ , సిరిసిల్ల**

సావిత్రిబాయి పూలే కు భారతరత్న ఇచ్చి గౌరవించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు అన్నారు. శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని బీసీ భవన్ లో బీసీ సంక్షేమ సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పర్శ హన్మాండ్లు హాజరై బీసీ నాయకులతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా పర్శ హన్మాండ్లు మాట్లాడుతూ భారతదేశ విద్యా వ్యవస్థ కీలక మలుపులో సావిత్రిబాయి పూలే పాత్ర చరిత్రాత్మకం అన్నారు, బాలికల విద్యా కొరకు 52 పాఠశాలలను స్థాపించి విద్యావ్యాప్తికి కృషి చేసిన గొప్ప మహనీయురాలు సావిత్రిబాయి పూలే అన్నారు. లింగ వివక్ష కు వ్యతిరేకంగా పోరాడిన చరిత్ర సావిత్రిబాయి పూలేదన్నారు , సావిత్రిబాయి పూలే స్ఫూర్తితో మహిళలు అన్ని రంగాలలో రాణించాలని ఉన్నత శిఖరాలకు ఎదగాలని పిలుపునిచ్చారు.భారతదేశ తొలి ఉపాధ్యాయిని అయిన సావిత్రిబాయి పూలే కు భారతరత్న బిరుదు ఇచ్చి గౌరవించాలని డిమాండ్ చేశారు. చట్టసభలలో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, కేంద్రంలో బీసీల కొరకు ప్రత్యేకమైన ఓబిసి మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, తెలంగాణ రాష్ట్రంలో వచ్చే స్థానిక సమస్యలు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు, ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వీరవేణి మల్లేష్ యాదవ్, సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు తడక కమలాకర్ ,జిల్లా కమిటీ సలహాదారుడు తోట్ల రాముల యాదవ్, నాయకులు బచ్చు ప్రసాద్, నల్ల శ్రీకాంత్, సామల తిరుపతి, చిందం శ్రీధర్ తదితరు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

- ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు నంద్యాడపు అంజయ్య..



**బలగం టీవీ, రుద్రంగి**

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు నంద్యాడపు అంజయ్య పేర్కొన్నారు.. శుక్రవారం రుద్రంగి మండల కేంద్రంలో ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గంను ఎకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా నంద్యాడపు అంజయ్య,ప్రధాన కార్యదర్శిగా కూర్మచెలం సత్యనారాయణ,ఉపాధ్యక్షుడిగా పోగుల మోహన్, కోశాధికారిగా ఆకుల గంగాధర్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రెస్ క్లబ్ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉంటామని తెలిపారు.. జర్నలిస్టులకు అండగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.. ఈ కార్యక్రమంలో టీ యు డబ్ల్యూ జె ఐజేయు జిల్లా సంయుక్త కార్యదర్శి ఎలిగేటి సూర్యకిరణ్, దేశవేణి ధర్మేష్, బింగిశెట్టి వెంకటేష్, ఎలిగేటి సూర్యకిరణ్, సుడిగెపు పరుశురాం, ఎలిగేటి ప్రదీప్, తుమ్మనపల్లి శ్రీనివాస్ లతో పాటు తదితరులు పాల్గొన్నారు.



## చిన్న పిల్లలతో వెట్టిచాకిరి చేయిస్తే క్రిమినల్ కేసులు తప్పవు..

- బాల కార్మికులు కనిపిస్తే పోలీస్ వారికి సమాచారం అందించండి.
- ఆపరేషన్ స్మైల్ - XI ను విజయవంతం చేద్దాం..
- ఎస్పీ అఖిల్ మహాజన్

**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**

చిన్నపిల్లలతో వెట్టి చాకిరి చేపిస్తే క్రిమినల్ కేసులు తప్పవని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నందు అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్,అదనపు ఎస్పీ చంద్రయ్య,వివిధ శాఖల అధికారులతో ఎస్పీ అఖిల్ మహాజన్ సమన్వయ సమావేశం నిర్వహించినారు. ఈ సందర్భంగా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరంలాగే ఈ సంవత్సరం కూడ జనవరి 01 నుండి 31వ తేదీ వరకు నిర్వహిస్తున్న ఆపరేషన్ స్మైల్ -XI ను ప్రతి ఒక్కరూ అంకిత భావంతో పని చేసి విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఆపరేషన్ స్మైల్ -XI లో పాలుపంచుకొంటున్న ప్రతి ఒక్క అధికారి సమన్వయంతో పక్కా ప్రణాళిక రుపొందించుకోని బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించేలా విధులు నిర్వహించాలన్నారు.ప్రతీ ఒక్కరి జీవితంలో బాల్యం అమూల్యమైనదని దానిని అనుభవించటం ప్రతీ పౌరుని హక్కు అని,క్షణికావేషంలో పిల్లలు తొందరపాటులో చిన్న చిన్న విషయాలకే తల్లి దండ్రులను విడిచి ఇంటికి దూరంగా ఉంటున్నారని,ఇట్టి అవకాశాన్ని ఆసరాగా తీసుకొని కొందరు వారిని ప్రమాదకర పనుల్లో వారితో పనులు చేయిస్తూ వారి జీవితాలతో ఆడుకుంటున్నారని అలాంటి వారిని గుర్తించి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని,గత సంవత్సరం నిర్వహించిన ఆపరేషన్ స్మైల్,ముస్కాన్ లో 21 మందిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరిగిందని అన్నారు. తప్పిపోయిన పిల్లలను వెతికి 'దర్పణ్ ' అప్లికేషన్ ద్వారా వారిని గుర్తించి,చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ముందు హాజరు పరచి తిరిగి తల్లి దండ్రుల వద్దకు చేర్చి వారి శోకాన్ని తీర్చాలన్నారు. బిక్షాటన చేస్తున్న వారి గురించి,బాలకార్మికుల గురించి ఎప్పటి కప్పుడు సమాచారం ఇవ్వడానికి చైల్డ్ హెల్ప్ లైన్ కు చెందిన 1098,112 నెంబర్ల గురించి ప్రజల్లో విస్తృత ప్రచారం చేయాలని అన్నారు .

సిరిసిల్ల, వేములవాడ డివిజన్ స్థాయిలో ఒక సబ్-ఇన్స్పెక్టర్ తో పాటుగా ఒక మహిళా పోలీస్ అధికారి, నలుగురు సిబ్బంది, వివిధ డిపార్ట్మెంట్ అధికారులతో నెల రోజుల పాటు ఇదే పనిపై ఇటుక బట్టి లు,వివిధ రకాల పరిశ్రమలు,బస్ స్టేషన్లు, ట్రాఫిక్ జంక్షన్ల వద్ద క్షుణ్ణంగా పరిశీలించి కుటుంబాలకు దూరంగా ఉంటున్న పిల్లలను గుర్తించాలని అన్నారు. స్కూల్స్ కు వెళ్లకుండా వివిధ కారణాల వల్ల డ్రాపౌట్ అయిన పిల్లల తల్లి దండ్రులకు నచ్చ చెప్పి తిరిగి వారిని పాఠశాలకు పంపే ఏర్పాటు చేసి వారికి కొత్త జీవితాన్ని ఇవ్వాలన్నారు.ఎక్కడైనా బాల కార్మికుల కనిపిస్తే డయల్ 100కు ఫోన్ చేసి లేదా పోలీస్ లకు సమాచారం తెలపాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో డిఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, సిడబ్ల్యూ సి చైర్మన్ అంజయ్య, డిఎంహెచ్ఓ రజిత, ఎస్ఐ రమేష్,షీ టీం ఏఎస్ఐ ప్రమీల, వివిధ డిపార్ట్మెంట్ ల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు

**బలగం టీవీ , తంగళ్లపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం సారంపల్లి గ్రామంలో ని ప్రాథమిక పాఠశాలలో సావిత్రిబాయి పులే 194వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు రాజేష్ సావిత్రిబాయి పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఆమె గొప్పతనాన్ని విద్యార్థులకు వివరిస్తూ దేశంలో తొలిసారిగా మహిళలకు పాఠశాలలు ప్రారంభించి చదువు చెప్పిన తొలి భారతీయ మహిళ ఉపాధ్యాయురాలు అని కొనియాడారు. ఆనాడు సమాజంలో కులాంతర వివాహాలు,వితంతువు పునర్వివాహాలు నిర్వహించిన గొప్ప మార్గదర్శి అని గొప్ప సంఘసంస్కర్త అని విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రతిభ పోటీలు నిర్వహించగా మొదటి స్థానంలో గుగ్గిళ్ళ శ్రీనిక, విహాన్, రిషిత గెలుపొందారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజేష్, ప్రశాంతి,వివో రేణుకా,పంచాయితీ కార్యదర్శి సమీర్,అంగన్వాడీ ఉపాధ్యాయులు ప్రభమ్మ,కవిత విద్యార్థుల తల్లి తండ్రులు పాల్గొన్నారు.

# కుప్పకూలిన భారత జట్టు

- ఫస్ట్ ఇన్నింగ్స్‌లో 185 పరుగులకు ఆలౌట్
- ఆస్ట్రేలియా 9/1

బలగం టీవీ, హైదరాబాద్

ఆస్ట్రేలియాతో జరుగుతున్న సిడ్నీ టెస్టులో ఇండియా ఫస్ట్ ఇన్నింగ్స్‌లో 185 పరుగులకు ఆలౌటైంది. ఐదో టెస్ట్‌లోనూ టీమిండియా బ్యాటర్లు తడబడ్డారు. బౌలింగ్‌కు అనుకూలంగా ఉన్న పిచ్‌పై ఆస్ట్రేలియా బౌలర్లు నిప్పులు చెరగడంతో పెవిలియన్‌కు క్యూ కట్టారు. ఐదు టెస్ట్‌ల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా సిడ్నీ వేదికగా శుక్రవారం ప్రారంభమైన ఈ మ్యాచ్‌లో టీమిండియా తొలి ఇన్నింగ్స్‌లో 185 పరుగులకు ఆలౌటైంది. చివర్లో కెప్టెన్ బుమ్రా కొన్ని మెరుపులు మెరిపించాడు. అతను 22 రన్స్ చేసి ఔటయ్యాడు. బుమ్రా ఇన్నింగ్స్‌లో మూడు బౌండరీలు, ఓ సిక్సర్ ఉన్నాయి.




టాస్ గెలిచిన ఇండియా మొదట బ్యాటింగ్ ఎంచు కున్నది. ఇండియన్ టాప్ ఆర్డర్ మరోసారి పేలవ ప్రదర్శన ఇచ్చింది. జైస్వాల్ 10, రాహుల్ 4, గిల్ 20, కోహ్లీ 17, పంత్ 40 రన్స్ చేసి ఔటయ్యారు.సిడ్నీ టెస్టుకు బుమ్రా కెప్టెన్సీ బాధ్యతలు నిర్వర్తించాడు. ఫామ్‌లో లేని రోహిత్ శర్మకు రెస్ట్ ఇవ్వడంతో.. ఫాస్ట్ బౌలర్ ఆ రోల్ ప్లే చేస్తున్నాడు. తొలి రోజు ఆట ముగిసే సమయానికి ఆస్ట్రేలియా ఒక వికెట్ కోల్పోయి 9 రన్స్ చేసింది. ఖవాజా వికెట్‌ను బుమ్రా తీశాడు. అతను 2 రన్స్ చేసి ఔటయ్యాడు.



## ఖో ఖో ప్రపంచకప్ ట్రోఫీ మస్కట్స్ విడుదల

బలగం టీవీ, హైదరాబాద్

భారత్ వేదికగా ఈనెల 13 నుంచి మొదలుకాబోతున్న అరంగేట్రం ఖో ఖో ప్రపంచకప్ కోసం ట్రోఫీతో పాటు మస్కట్స్ తేజస్, తారను జాతీయ ఖోఖో అసోసియేషన్(కేకేఎఫ్ఐ) ఆధ్వర్యంలో విడుదల చేశారు. భారత క్రీడా ప్రాధికార సంస్థ(సాయ్) ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ ఇండోర్ స్టేడియంలో ఖోఖో ప్రపంచకప్ పోటీలు జరుగనున్నాయి. తొలిసారి జరుగబోతున్న ఈ టోర్నీలో ఆరు ఖండాలలోని 24 దేశాల నుంచి 21 పురుషుల, 20 మహిళల జట్లు బరిలో ఉన్నాయి. పురుషుల చాంపియన్‌షిప్ కోసం నీలిరంగు ట్రోఫీ, మహిళల ఈవెంట్ కోసం గ్రీన్ ట్రోఫీలను ఆవిష్కరించారు. మరోవైపు టోర్నీ అధికారిక మస్కట్‌లుగా 'తేజస్', 'తార'ను ఫెడరేషన్ ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈ మస్కట్‌లు వేగం, చురుకుదనం..జట్టు కృషి వంటి ప్రధాన లక్షణాలు కల్గి ఉంటాయి. భారత సంప్రదాయ క్రీడ యొక్క వారసత్వాన్ని ప్రతిబింబించేలా వీటిని రూపొందించారు.

## టీబీఏ అధ్యక్షుడిగా శ్రీధర్‌బాబు

బలగం టీవీ, హైదరాబాద్

తెలంగాణ బ్యా డ్మింటన్ అసోసియేషన్ (టీబీఏ) నూత న అధ్యక్షుడిగా మంత్రి శ్రీధర్‌బాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ విషయాన్ని భారత బ్యాడ్మింటన్ అసోసియేషన్(బీఏఐ) ఉపాధ్యక్షుడు పుల్లెల గోపీచంద్ శుక్రవారం అధికారిక ప్రకటనలో పేర్కొన్నారు.



## హైదరాబాద్‌కు ఘోర పరాజయం

బలగం టీవీ, హైదరాబాద్

విజయ్ హజారే ట్రోఫీలో భాగంగా హైదరాబాద్‌తో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో అభిషేక్ శర్మ(72 బంతుల్లో 7 ఫోర్లు, 6 సిక్సలతో 93) విధ్వంసకర బ్యాటింగ్‌తో చెలరేగాడు. తృటిలో శతకాన్ని చేజార్చుకున్నా తొలి వికెట్‌కు 196 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. మరో ఓపెనర్ ప్రభ్‌సిమ్రాన్ సింగ్(105 బంతుల్లో 20 ఫోర్లు, 3 సిక్సలతో 137) సెంచరీతో చెలరేగాడు. ఈ టోర్నీలో అతనికి ఇది వరుసగా మూడో శతకం. గత రెండు మ్యాచ్‌ల్లో ముంబైపై 150 నాటౌట్, సౌరాష్ట్రపై(125) సెంచరీలు సాధించాడు. ప్రభ్‌సిమ్రాన్–అభిషేక్ విధ్వంసంతో హైదారబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో పంజాబ్ 80 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది.

ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన పంజాబ్ నిర్ణీత 50 ఓవర్లలో 4 వికెట్లకు 426 పరుగులు చేసింది. రమణ్‌దీప్ సింగ్(53 బంతుల్లో 6 ఫోర్లు, 4 సిక్సలతో 80) హాఫ్ సెంచరీతో రాణించాడు. హైదరాబాద్ బౌలర్లలో మొహమ్మద్, నిశాంత్, అనికేత్ రెడ్డి, తనయ్ త్యాగరాజన్ తలో వికెట్ తీసారు. అనంతరం లక్ష్యచేధనకు దిగిన హైదరాబాద్ 47.5 ఓవర్లలో 346 పరుగులకు కుప్పకూలింది. పి నితేష్ రెడ్డి(87 బంతుల్లో 13 ఫోర్లు, 4 సిక్సలతో 111) సెంచరీ సాధించగా.. తనయ్ త్యాగరాజన్(42 బంతుల్లో 10 ఫోర్లు, 2 సిక్సలతో 74) హాఫ్ సెంచరీతో రాణించాడు. కెప్టెన్ తిలక్ వర్మ(42 బంతుల్లో ఫోర్‌తో 28) తీవ్రంగా నిరాశపరిచాడు. పంజాబ్ బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్(4/50) నాలుగు వికెట్లు తీయగా.. రఘు శర్మ మూడు వికెట్లు పడగొట్టాడు. అభిషేక్ శర్మ, సన్వీర్ సింగ్, నమన్ ధిర్ తలో వికెట్ తీసారు. ఈ మ్యాచ్ ద్వారా పంజాబ్ అరుదైన రికార్డ్ సాధించింది. విజయ్ హజారే ట్రోఫీ చరిత్రలోనే ఒకే సీజన్‌లో రెండు సార్లు 400 ప్లస్ రన్స్ చేసిన తొలి జట్టుగా పంజాబ్ రికార్డ్ సాధించింది.



## బెల్లంకొండ పోస్టర్ విడుదల

బలగం టీవీ, హైదరాబాద్

బెల్లంకొండ సాయిశ్రీనివాస్ కథానాయకుడిగా రూపొందుతోన్న డివైన్, యాక్షన్ అడ్వెంచర్ 'బీఎస్ఎస్ 12'(వర్కింగ్ టైటిల్). సుధీర్‌రెడ్డి దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. మహేష్ చందు నిర్మాత. శుక్రవారం బెల్లంకొండ సాయిశ్రీనివాస్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమాలో ఆయన పాత్రకు సంబంధించిన పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో రెండుకాళ్లు సీటుపై పెట్టి ధైర్యంగా బైక్ నడుపుతూ అడ్వెంచర్ అవతార్‌లో బెల్లంకొండ సాయి కనిపిస్తున్నారు. అతని వెనుక ఒక కొండ.. ఆ కొండపై రగులుతున్న విష్ణు నామాలు చూడొచ్చు. 400ఏళ్ల నాటి దశావతార ఆలయం నేపథ్యంలో సాగే యాక్షన్ అడ్వెంచర్ మూవీ ఇదని, బెల్లంకొండ సాయి కెరీర్‌లోనే హయ్యెస్ట్ బడ్జెట్‌తో ఈ సినిమా రూపొందుతున్నదని, 35శాతం షఉటింగ్ పూర్తయిందని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: శివేంద్ర, సంగీతం: లియోన్ జేమ్స్, నిర్మాణం: మూన్‌షైన్ పిక్చర్స్.

## తెలుగు నటి, దర్శకురాలు అపర్ణ మృతి

బలగం టీవీ, హైదరాబాద్



టాలీవుడ్ లో మరో విషాదం చోటుచేసుకుంది. నటి, రచయిత, నిర్మాత దర్శకురాలు అపర్ణ మల్లాది క్యాన్సర్ మహమ్మారితో పోరాడుతూ కన్నుమూశారు. ఆమె వయసు 54 ఏళ్లు. అమెరికాలోని లాస్ ఏంజెలెస్ లో ఆమె మరణించారు. రెండేళ్ల క్రితం ఆమె క్యాన్సర్ బారిన పడ్డారు. తొలుత ట్రీట్మెంట్ కు ఆమె శరీరం సహకరించినప్పటికీ... ఆ తర్వాత చికిత్స పని చేయలేదు. దీంతో, ఆమెకు క్యాన్సర్ తిరగబెట్టింది. మెరుగైన చికిత్స కోసం అమెరికాకు వెళ్లిన అపర్ణ... అక్కడే చికిత్స పొందుతూ మృతి చెందారు. 'ది అనుశ్రీ ఎక్స్ పెరిమెంట్స్' అనే చిత్రంతో ఆమె సినీ ప్రయాణాన్ని మొదలు పెట్టారు. ఆ తర్వాత 'పోష్ పోరీస్' అనే వెబ్ సిరీస్ చేశారు. ఓటీటీలు రాకముందే చేసిన ఈ వెబ్ సిరీస్ యూట్యూబ్ లో అందుబాటులో ఉంది. రెండేళ్ల క్రితం 'పెళ్లికూతురు' అనే సినిమా చేశారు. ఆ తర్వాత క్యాన్సర్ బారిన పడ్డారు.

ఎంతో మంది నటులకు, దర్శకులకు అవకాశాలు రావడానికి ఆమె ఎంతో కృషి చేశారని తెలుస్తోంది. ఫిల్మ్ ఇన్ స్టిట్యూట్ విద్యార్థులకు డైరెక్షన్ లోని మెళకువలు కూడా నేర్పించేవారు. ఆమె మరణంతో టాలీవుడ్ లో విషాదం నెలకొంది. పలువురు సినీ ప్రముఖులు ఆమె మృతి పట్ల దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.



## అల్లు అర్జున్‌కు రెగ్యులర్ బెయిల్ మంజూరు

### రూ. 50 వేల రెండు పూచీకత్తులు సమర్పించాలని ఆదేశం

బలగం టీవీ, హైదరాబాద్

టాలీవుడ్ స్టార్ హీరో అల్లు అర్జున్‌కు నాంపల్లి కోర్టు భారీ ఊరటను కల్పించింది. సంధ్య థియేటర్ తొక్కిసలాట కేసులో షరతులతో కూడిన రెగ్యులర్ బెయిల్ మంజూరు చేసింది. రూ. 50 వేల రెండు పూచీకత్తులు సమర్పించాలని ఆదేశించింది. రిమాండ్ ముగిసిన నేపథ్యంలో ఇటీవల జరిగిన కోర్టు విచారణకు అల్లు అర్జున్ వర్చువల్ గా హాజరయ్యారు. అదే రోజున రెగ్యులర్ బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ ఆయన తరపు న్యాయవాదులు పిటిషన్ వేశారు. రెగ్యులర్ పిటిషన్ పై విచారణ జరిపిన కోర్టు ఈరోజు తీర్పును వెలువరించింది. కాగా, బెయిల్ మంజూరు సందర్భంగా కోర్టు అల్లు అర్జున్ కు పలు షరతులు విధించింది. ప్రతి ఆదివారం చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ లో హాజరుకావాలని ఆదేశించింది. ఈ కేసులో సాక్షులను ప్రభావితం చేయరాదని స్పష్టం చేసింది. ఈ మేరకు అల్లు అర్జున్ తరపు న్యాయవాది అశోక్ రెడ్డి వెల్లడించారు.

## జనవరి 6న వెంకటేష్ 'సంక్రాంతికి వస్తున్నాం' ట్రైలర్ ఈవెంట్

బలగం టీవీ, హైదరాబాద్




టాలీవుడ్ అగ్ర నటుడు విక్టరీ వెంకటేశ్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం సంక్రాంతికి వస్తున్నాం . యంగ్ డైరెక్టర్ అనిల్ రావుపూడి దర్శకత్వంలో వస్తున్న ఈ చిత్రం సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు రానుంది. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు ఈ సినిమాను నిర్మిస్తున్నాడు. పక్కా ఫ్యామిలీ ఎంటర్టైనర్ గా వస్తున్న ఈ సినిమాలో వెంకటేష్ భార్యగా ఐశ్వర్య రాజేష్ మాజీ గర్ల్ ఫ్రెండ్ గా మీనాక్షి చౌదరి నటిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన సాంగ్స్ ప్రేక్షకుల్లో మంచి అంచనాలు పెంచాయి. అయితే ప్రమోషన్స్‌లో భాగంగా ఈ సినిమా ట్రైలర్ వేడుకను నిజామాబాద్ జిల్లాలో నిర్వహించబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ నెల 06న నిజామాబాద్ కలెక్టర్ గ్రౌండ్‌లో గ్రాండ్‌గా ట్రైలర్ లాంచ్ ఈవెంట్ ను ఉంటుందని మేకర్స్ వెల్లడించారు. గతంలో అనిల్ రావిపూడి, వెంకటేష్ కాంబినేషన్‌లో వచ్చిన ఎఫ్ 2, ఎఫ్ 3 చిత్రాలు ఘన విజయాలను అందుకున్న సంగతి తెలిసిందే. వీరిద్దరి కాంబోలో మూడో సినిమా వస్తుడటంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు ప్రేక్షకులు.